TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 29 | 10-06-2026 బుధవారం | పేజీలు: 06 | వెల: 3/-


తాను కష్టాలలో ఉన్నప్పుడు
కూడా
నవ్వగలిగే వారు
నాకు ఆదర్శం

తాను ఆపదలో ఉన్నప్పుడు
కూడా
ఇతరులకు సహాయం
చేయగలిగే వారు
నాకు స్ఫూర్తి

## రిలీజ్‌కు సిద్ధమైన 'కొరియన్ కనకరాజు'!




## బాల్క సుమన్ అరెస్టు రాజకీయ కక్షసాధింపే: దాసోజు శ్రవణ్

- సింగరేణి అక్రమాలను ప్రశ్నించినందుకే జైలుకు పంపారని ఆరోపణ
- చంచల్‌గూడ జైలులో బాల్క సుమన్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు
- దళిత నాయకుడిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శ
- సింగరేణిలో వేల కోట్ల అవినీతి జరుగుతోందని ఆరోపణ
- ప్రతిపక్ష నేతలపై మాత్రమే చట్టాలు అమలు చేస్తున్నారని మండిపాటు
- రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్న
- కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్
- తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలు ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన
- బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం కొనసాగించాలని పిలుపు




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
సింగరేణి బొగ్గు గనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రజల ముందుంచినందుకే బీఆర్ఎస్ ..మిగతా 2లో

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

- ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య
- కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, ..మిగతా 2లో



## గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు

- అశ్వారావుపేటలో అభివృద్ధి పనుల ప్రారంభం
- 25 లక్షల రైతులకు రుణమాఫీ: మంత్రి
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ..మిగతా 2లో



## ప్రతి గింజను కొంటున్నాం

- 72 లక్షల టన్నుల ధాన్యం సేకరణ..
- రైతుల ఖాతాల్లో రూ.14 వేల కోట్లు జమ
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- రాష్ట్రం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనడం లేదని ప్రశ్న
- మొక్కజొన్న కొనుగోలుపైనా కేంద్రం ముందుకు రావాలని డిమాండ్
- రైతుల కోసం రూ.22 వేల కోట్ల రుణమాఫీ అమలు చేశామని వెల్లడి
- 30 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం
- డిస్కమ్‌లకు ఏటా రూ.14 వేల కోట్ల భారం భరిస్తున్న రాష్ట్రం
- 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- దేవాదుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రైతుల సంక్షేమం, ..మిగతా 2లో

# ప్రయాణికులు కాదు.. ఇక బస్సుల ఓనర్లు

- మహిళా శక్తికి రేవంత్ సర్కార్ ప్రణాళికలు
- 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ
- సీఎం చేతుల మీదుగా భారీ ప్రారంభోత్సవం
- అందుబాటులోకి రానున్న 400 లగ్జరీ బస్సులు
- అద్దె రూపంలో ప్రతి నెల రూ. 69,468 నేరుగా జమ
- ఏడాదికి రూ. 244.08 కోట్ల స్థిర ఆదాయం
- బ్యాంకు రుణాలు తీరగానే సంఘాలకే పూర్తి సొంత ఆస్తి
- టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే డ్రైవర్, కండక్టర్ల నియామకం
- నిర్వహణ బాధ్యతలన్నీ సంస్థవే
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమన్న సీఎం
- క్యాంటీన్లు, బంకుల తర్వాత రవాణా రంగం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించడం, వారి ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మరో ప్రతిష్టాత్మక విప్లవాత్మక అడుగు వేసింది. మహిళలను కేవలం ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే ప్రయాణికులుగా మాత్రమే చూడకుండా, వారిని నేరుగా కోట్ల విలువైన ఆర్టీసీ బస్సులకే యజమానులుగా మార్చే ఒక అద్భుతమైన వినూత్న కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు రవాణా రంగంలో భాగస్వామ్యం కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా విద్యా, సామాజిక రంగాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

**సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 'మహిళాశక్తి సభ'.. 553 బస్సుల ప్రారంభం**

ఈ చారిత్రాత్మక పథకం ప్రారంభోత్సవం కోసం సికింద్రాబాద్ లోని ..మిగతా 2లో

## కర్ణాటకలో ఆగని అసమ్మతి స్వరాలు

- శాఖల కేటాయింపుపై మళ్లీ చెలరేగిన వివాదం
- కృష్ణ బేరె గౌడ అసంతృప్తితో కాంగ్రెస్‌లో కలకలం
- బీడీఏ, బీఎంఆర్‌డీఏ అధికారాలు సీఎం వద్దే
- పూర్తి స్థాయి అధికారాలు లేకుండా బాధ్యతలు వద్దన్న మంత్రి
- సమస్య పరిష్కారం కోసం అధిష్ఠానం తలుపుతట్టనున్న కృష్ణ బేరె
- ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి ఏర్పాట్లు
- రామలింగారెడ్డి రాజీనామా ఉదంతం ఇంకా మరువకముందే కొత్త వివాదం
- మంత్రివర్గంలో చోటు కోసం ఎమ్మెల్యేల లాబీయింగ్
- ప్రభుత్వ ఏర్పాటుకు వెంటనే అంతర్గత సవాళ్లు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో శాఖల కేటాయింపు వ్యవహారం మరోసారి రాజకీయ చర్చకు ..మిగతా 2లో



## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

- అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్
- ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్టు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, ..మిగతా 2లో

## వ్యాపారవేత్త ఇంట్లో కిలో బంగారం చోరీ

- నేపాలీ దంపతులపై అనుమానం..
- గచ్చిబౌలిలోని విల్లాలో భారీ దొంగతనం
- బంగారు ఆభరణాలు, వజ్రాలతో పరారైనట్లు అనుమానం
- నెల రోజుల క్రితమే పనిలో చేరిన నేపాలీ దంపతులు
- ముంబయి వెళ్లిన యజమాని కుటుంబం
- తిరిగి వచ్చేసరికి కనిపించని ఇంటి సిబ్బంది
- తాళాలు పగలగొట్టిన ఆనవాళ్లు లేకపోవడంతో అనుమానాలు
- పూజ గదిలోని బంగారు గొలుసు సహా ఆభరణాలు మాయం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలింపు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్ నగరంలో మరో భారీ చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. గచ్చిబౌలిలోని ఓ ప్రముఖ విల్లా సముదాయంలో నివాసం ఉంటున్న వ్యాపారవేత్త ఇంట్లో సుమారు కిలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలో ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన దంపతులపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాలో ఓ వ్యాపారవేత్త కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి నిర్వహణ పనుల కోసం నెల రోజుల క్రితం నేపాల్‌కు చెందిన ఓ దంపతులను పనిలో నియమించుకున్నారు. వారు ఇంటి పనులతో పాటు ఇతర గృహ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.
కొద్దిరోజుల క్రితం వ్యాపారవేత్త కుటుంబ సభ్యులు వ్యక్తిగత ..మిగతా 2లో




## ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తుల కేసులో దర్యాప్తు
- మాదాపూర్‌లోని నివాసంలో ఉదయం నుంచి తనిఖీలు
- ఏకకాలంలో 11 ప్రాంతాల్లో సోదాలు
- బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేపట్టిన అధికారులు
- ఆస్తులు, పెట్టుబడుల వివరాలపై ఆరా
- పత్రాలు, ఆర్థిక లావాదేవీల పరిశీలన
- ఏసీబీ ప్రత్యేక బృందాల రంగప్రవేశం
- సోదాలు పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడి
- అధికార వర్గాల్లో చర్చనీయాంశమైన పరిణామం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రోడ్లు-భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (ఈఎన్‌సీ) మోహన్ నాయక్‌కు సంబంధించిన ఆస్తుల వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆయన నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో విస్తృత సోదాలు చేపట్టారు.
మాదాపూర్‌లోని మోహన్ నాయక్ నివాసానికి ..మిగతా 2లో

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

మొదటిపేజీ తరువాయి



రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.

రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

# ప్రయాణికులు కాదు.. ఇక బస్సుల ఓనర్లు

మొదటిపేజీ తరువాయి

పరేడ్ గ్రౌండ్స్ వేదికగా ప్రభుత్వం అత్యంత భారీ ఎత్తున 'మహిళాశక్తి సభ'ను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు హాజరైన ఈ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, మహిళా సంఘాలకు కేటాయించిన మొత్తం 553 ఆర్టీసీ బస్సులను అధికారికంగా అందజేసి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ పంపిణీ కాబోయే బస్సుల బృందంలో తాజాగా అత్యాధునిక హంగులతో ప్రభుత్వ రవాణా వ్యవస్థలోకి జోడించిన 400 సరికొత్త 'ఇందిరా మహిళా శక్తి' లగ్జరీ బస్సులు కూడా ఉండటం విశేషం. దీనివల్ల మహిళా సంఘాలకు అద్భుతమైన స్థిర ఆదాయం లభించనుంది.

**బ్యాంకు రుణాల ద్వారా కొనుగోలు..**
**టీజీఎస్ఆర్టీసీతో ఒప్పందం**

రాష్ట్రంలోని పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక చొరవ తీసుకుని, వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల సహాయంతో మహిళా పొదుపు సంఘాలకు భారీ ఎత్తున రుణాలు ఇప్పించి ఈ 553 బస్సులను కొనుగోలు చేయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఈ బస్సులన్నింటినీ అద్దె (హైరింగ్) ప్రాతిపదికన తన పరిధిలోకి తీసుకుని వివిధ రూట్లలో నడుపుతుంది. బస్సులను నడపడానికి అవసరమైన డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీ యాజమాన్యమే స్వయంగా నియమించి సమకూరుస్తుంది. దీంతో మహిళలకు ఎలాంటి నిర్వహణ తలనొప్పులు ఉండవు.

**నెలకు రూ. 69,468 క్లియర్ ప్రాఫిట్.. నేరుగా**
**మహిళల ఖాతాల్లోకే నగదు**

ఈ వినూత్న వ్యాపార నమూనా (బిజినెస్ మోడల్) ప్రకారం.. బస్సులకు సంబంధించిన డ్రైవర్, కండక్టర్ల నెలవారీ జీతభత్యాలు, డీజిల్ ఖర్చులు మరియు ఇతర సాంకేతిక నిర్వహణ ఖర్చులన్నింటినీ ఆర్టీసీ సంస్థే భరిస్తుంది. ఈ ఖర్చులన్నీ పోను మిగిలిన నికర లాభం కింద ఒక్కో బస్సుకు ప్రతి నెల ఖచ్చితంగా రూ. 69,468 ల అద్దె సొమ్మును రవాణా శాఖ నేరుగా సంబంధిత మహిళా సంఘాల ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. దీనివల్ల ఎలాంటి వ్యాపార అనుభవం లేకపోయినప్పటికీ, మహిళా సంఘాల సభ్యులకు ప్రతి నెలా ఒక ఒకటో తేదీ రాగానే స్థిరమైన లాభం చేతికి అందుతుంది.

**రూ. 199 కోట్ల పెట్టుబడి..**
**ఏడాదికి రూ. 244 కోట్ల భారీ ఆదాయం**

ఈ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారీ ప్రాజెక్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ మహిళా సమాఖ్యలు, సంఘాలు కలిసి బ్యాంకుల ద్వారా రూ. 199.08 కోట్ల భారీ పెట్టుబడిని పెట్టాయి. ఈ పెట్టుబడికి ప్రతిఫలంగా వారికి ప్రతి నెల ఆర్టీసీ సంస్థ నుండి రూ. 20.34 కోట్ల చొప్పున.. ఏడాదికి మొత్తంగా రూ. 244.08 కోట్ల స్థిరమైన అద్దె ఆదాయం సమకూరనుంది. ప్రారంభంలో బస్సుల కొనుగోలు కోసం తీసుకున్న బ్యాంకు అప్పులు (ఇన్‌స్టాల్‌మెంట్లు) పూర్తిగా చెల్లింపు పూర్తయిన తర్వాత, ఆయా ఆర్టీసీ బస్సులు వంద శాతం లీగల్‌గా సదరు మహిళా సమాఖ్యల సొంత ఆస్తిగా మారిపోతాయి.

**దేశంలోనే తొలి ప్రయోగం.. మహిళలను**
**వ్యాపారవేత్తలుగా మార్చడమే ధ్యేయం**

భారతదేశ చరిత్రలోనే మహిళా పొదుపు సంఘాలకు ఈ స్థాయిలో వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులను కేటాయించి, వారిని పెద్ద



ఎత్తున రవాణా రంగ వ్యాపారవేత్తలుగా (ఎంటర్‌ప్రెన్యూర్స్) మార్చేలా ఇలాంటి ఒక వినూత్న సాహసోపేత పథకాన్ని అమలు చేయడం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ప్రథమం కావడం విశేషం. కేవలం బస్సుల పంపిణీతోనే సరిపెట్టకుండా, మహిళలు సమాజంలో ఆర్థికంగా ఎవరిపైనా ఆధారపడకుండా వివిధ రకాల స్వయం ఉపాధి రంగాలలో, గృహ పరిశ్రమలలో రాణించేందుకు వీలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సభలోనే ఏకంగా రూ. 500 కోట్ల విలువైన 'వడ్డీ లేని రుణాల' చెక్కులను కూడా మహిళా ప్రతినిధులకు పంపిణీ చేయనున్నారు.

**క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల తర్వాత**
**ఇప్పుడు ఆర్టీసీ బస్సుల నిర్వహణ**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మహిళలను కేవలం వంటింటికే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో అగ్రగాములుగా నిలబెడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తున్న 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు', మహిళల ఆధ్వర్యంలోని 'పెట్రోల్ బంకులు', ప్రభుత్వ పాఠశాలల పిల్లల 'స్కూల్ యూనిఫాం తయారీ కేంద్రాల' బాధ్యతలను మహిళలకే ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ నమ్మకంతోనే ఏకంగా ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల ఓనర్‌షిప్‌ను కూడా మహిళల చేతుల్లో పెడుతున్నామని సీఎం సగర్వంగా ప్రకటించారు.

**మహిళల్లో హర్షా తిరేకాలు..**
**ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ 'ఇందిరా మహిళా శక్తి' బస్సుల పథకం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాల సభ్యుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తాము కోట్లతో కూడిన పెద్ద పెద్ద బస్సులకు యజమానులవుతామని ఎన్నడూ ఊహించలేదని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా వచ్చే స్థిర ఆదాయంతో తమ పిల్లల ఉన్నత చదువులకు, కుటుంబ అవసరాలకు ఎంతో మేలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశంతో తెలంగాణ నారీ లోకం ఆర్థిక స్వావలంబన దిశగా సరికొత్త చరిత్రను లిఖించబోతోంది.

## బాల్క సుమన్ అరెస్టు రాజకీయ కక్షసాధింపే: దాసోజు శ్రవణ్

మొదటిపేజీ తరువాయి

నాయకుడు బాల్క సుమన్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం కేసులు నమోదు చేసిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపించారని విమర్శించారు. చంచల్‌గూడ జైలులో బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

సింగరేణి కార్మికుల సమస్యలు, అక్కడ జరుగుతున్న అవకతవకలపై మాట్లాడటం తప్ప మరే నేరం బాల్క సుమన్ చేయలేదని దాసోజు అన్నారు. కార్మికుల తరఫున గొంతెత్తిన వ్యక్తిని నేరస్థుడిలా చిత్రీకరించి జైలుకు పంపించడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఒక దళిత నాయకుడు అధికార పార్టీని ప్రశ్నించాడనే కారణంతోనే ఈ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సింగరేణి కాలరీస్‌లో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరుగుతున్నాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడమే బాల్క సుమన్ చేసిన పని అని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడిన వ్యక్తిపై కేసులు పెట్టడం ద్వారా ప్రభుత్వం అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే నాయకులను భయపెట్టాలనే ఉద్దేశంతోనే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు.

బాల్క సుమన్‌పై అమలు చేసిన చట్టాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులకు ఎందుకు వర్తించడం లేదని దాసోజు ప్రశ్నించారు. బహిరంగ సభల్లో పలువురు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, వాటిపై కూడా కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష నేతల విషయంలో ఒక రకంగా, అధికార పార్టీ నేతల విషయంలో మరో రకంగా వ్యవహరించడం చట్టపరమైన సమానత్వానికి విరుద్ధమని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో చట్ట పాలన కంటే రాజకీయ ప్రతీకార రాజకీయాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం సాధారణంగా మారిందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామమని వ్యాఖ్యానించారు.సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎప్పటికీ పోరాడుతుందని దాసోజు స్పష్టం చేశారు. కార్మికుల సమస్యలు, సంస్థలో జరుగుతున్న అవకతవకలను ప్రజల ముందుకు తీసుకురావడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అలాంటి పోరాటాలను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా వెనక్కి తగ్గబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులు బహిరంగ సభల్లో చేస్తున్న వ్యాఖ్యలపై కూడా పోలీసులు అదే వేగంతో స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానంగా అమలైతేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అధికార పార్టీ నాయకుల విషయంలో మౌనం పాటిస్తూ ప్రతిపక్షాలపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదన్నారు.

తెలంగాణలో ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలు దెబ్బతింటున్నాయని దాసోజు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రస్తావించే నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బాల్క సుమన్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. చట్టపరంగానూ, రాజకీయంగానూ ఈ అంశంపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజల తరఫున మాట్లాడిన వారిని ఎంతగా ఇబ్బందులకు గురిచేసినా సత్యం గెలుస్తుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని దాసోజు శ్రవణ్ కుమార్ పేర్కొన్నారు.

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

మొదటిపేజీ తరువాయి

తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు.

"కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు.

తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్ 2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.



## గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ , డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.

పేదవాడి ఆత్మగౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వారావుపేట నియోజకవర్గానికే నాలుగు వేల ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. చివరి పేదవాడి వరకూ లబ్ధి చేకూరుస్తామని చెప్తూ, భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల్లో G+3 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే అందిన లబ్ధి, నేడు ప్రతి పేదవాడికి చేరుతోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ అశ్వారావుపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ కులమతాలకు, పేద ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2300 మంది విద్యార్థులు చదువుకుంటారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు. స్థానికంగా కొమురం భీమ్ అర్బన్ పార్క్ ప్రారంభం, పూసుకుంట కొండ రెడ్ల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ పేదవాడి ప్రభుత్వమని, భవిష్యత్తులో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేరుస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు , పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వ్యాపారవేత్త ఇంట్లో కిలో బంగారం చోరీ

మొదటిపేజీ తరువాయి

పనుల నిమిత్తం ముంబయికి వెళ్లారు. ఆదివారం తిరిగి ఇంటికి చేరుకున్న తర్వాత ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ దంపతులు కనిపించకపోవడంతో మొదట వారు చెప్పకుండా వెళ్లిపోయి ఉంటారని భావించారు. ఇంటి తాళాలు పగలగొట్టిన ఆనవాళ్లు లేకపోవడం, బలవంతంగా ప్రవేశించిన సూచనలు కనిపించకపోవడంతో పెద్దగా అనుమానం వ్యక్తం చేయలేదు.

అయితే అనంతరం ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తుండగా పూజ గదిలో దేవతా విగ్రహానికి అలంకరించిన బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇంట్లోని ఇతర విలువైన వస్తువులను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు కూడా మాయమైనట్లు గుర్తించారు. మొత్తం చోరీకి గురైన ఆభరణాల విలువ భారీగానే ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు కిలో బంగారం, విలువైన వజ్రాభరణాలు అపహరణకు గురైనట్లు తెలుస్తోంది. ఘటనపై వ్యాపారవేత్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు ఇంట్లో పనిచేసిన నేపాలీ దంపతులపైనే ప్రధాన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చోరీ జరిగిన తర్వాత వారు కనిపించకుండా పోవడం, బలవంతపు ప్రవేశానికి సంబంధించిన ఆనవాళ్లు లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కేసు దర్యాప్తులో భాగంగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. విల్లా పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిందితులు ఎప్పుడు, ఎలా వెళ్లిపోయారు, వారి వెంట ఎవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

ఇటీవల హైదరాబాద్‌లో నేపాలీ గ్యాంగ్‌లకు సంబంధించి పలు చోరీ ఘటనలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో ఈ కేసుకు ప్రాధాన్యత సంతరించుకుంది. పరారీలో ఉన్న దంపతుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. చోరీకి గురైన ఆభరణాల విలువ, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నాయి.




## ప్రతి గింజను కొంటున్నాం

వ్యవసాయాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. జనగామ జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 72 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపుల కింద రూ.14 వేల కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. రైతులు తమ పంటను విక్రయించడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని భట్టి పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకుని వారికి ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యం సేకరిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించడం లేదని భట్టి విమర్శించారు. రాష్ట్రం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. అదేవిధంగా రైతులు పండించిన మొక్కజొన్నను కూడా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం భారీ వ్యయం చేస్తోందని భట్టి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందుకోసం డిస్కమ్‌లకు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల మేర చెల్లింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. గృహ వినియోగదారులకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోందని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఏటా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేస్తోందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ అంశాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.22 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేసినట్లు వెల్లడించారు. ఇది దేశ చరిత్రలోనే అతి పెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. రైతుల ఆర్థిక భారం తగ్గించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారిందని చెప్పారు.

దేవాదుల ప్రాజెక్టుపై కూడా భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నిధులు కేటాయించకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మంజూరు చేసి పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి వరంగల్‌తో పాటు పలు జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని భట్టి పేర్కొన్నారు. అందుకే ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, సంక్షేమ పథకాల అమలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.



# ఈఎన్‌సీ మోహన్ నాయక్ నివాసంలో ఏసీబీ సోదాలు

**మొదటిపేజీ తరువాయి**

బుధవారం ఉదయం చేరుకున్న ఏసీబీ బృందాలు తనిఖీలు ప్రారంభించాయి. ఇదే సమయంలో ఆయనకు సంబంధించిన ఇతర ఆస్తులు, బంధువుల నివాసాలు, అనుబంధ ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మొత్తం 11 ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదులు, ప్రాథమిక సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సోదాల సందర్భంగా ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడులు, స్థిరాస్తుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మోహన్ నాయక్‌కు చెందిన ఆస్తులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను కూడా ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. పలు కీలక పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, స్థిరాస్తుల విలువ వంటి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించలేదు. తనిఖీలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నతాధికారికి సంబంధించిన ఈ సోదాలు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. సోదాల అనంతరం వెలుగులోకి వచ్చే వివరాలపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఏసీబీ బృందాలు పలు కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నాయి.



# కర్ణాటకలో ఆగని అసమ్మతి స్వరాలు

**మొదటిపేజీ తరువాయి**

దారి తీసింది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంత్రివర్గానికి శాఖలను కేటాయించిన అనంతరం అసంతృప్తి స్వరాలు క్రమంగా బయటపడుతున్నాయి. తాజాగా గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బేరె గౌడ అసంతృప్తి వ్యక్తం చేయడంతో ప్రభుత్వంలో అంతర్గత విభేదాలపై చర్చ మొదలైంది.

కృష్ణ బేరె గౌడకు గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖను అప్పగించినప్పటికీ ఆ శాఖకు సంబంధించిన అత్యంత కీలక సంస్థలైన బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బీడీఏ), బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (బీఎంఆర్‌డీఏ)లను ముఖ్యమంత్రి తన ఆధీనంలోనే ఉంచుకున్నారు. దీంతో శాఖ మంత్రి అధికారాలు పరిమితమవుతున్నాయని కృష్ణ బేరె గౌడ అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.

బెంగళూరు నగర విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, భూవినియోగ విధానాలు, కొత్త లేఅవుట్లు, రహదారుల నిర్మాణం వంటి కీలక అంశాలు బీడీఏ, బీఎంఆర్‌డీఏ పరిధిలో ఉంటాయి. అలాంటి సంస్థలపై నియంత్రణ లేకుండా నగరాభివృద్ధి శాఖను సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యం కాదని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు.ఈ అంశంపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కృష్ణ బేరె గౌడ ఇప్పటికే చర్చించినట్లు సమాచారం. అయితే ఆయన ఆశించిన స్థాయిలో హామీలు లభించకపోవడంతో విషయం ఇంకా పరిష్కారం కాలేదు. పూర్తి అధికారాలు, స్పష్టమైన బాధ్యతలు లభించిన తర్వాతే శాఖను స్వీకరిస్తానని ఆయన సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఈ పరిణామాల మధ్య ఆయన ఢిల్లీకి వెళ్లడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కలిసి తన అభిప్రాయాలను వివరించనున్నట్లు సమాచారం. రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాలపై అధిష్ఠానం దృష్టి సారించాలని కోరనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉండగా నగరాభివృద్ధి శాఖ అంశం కాంగ్రెస్‌లో ఇప్పటికే ఒక వివాదానికి కారణమైంది. సీనియర్ నేత రామలింగారెడ్డి కూడా ఇదే శాఖ కోసం ఆసక్తి చూపారు. తనకు ఆ శాఖ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. పరిస్థితి అంతగా ముదిరి ఆయన మంత్రి పదవికి రాజీనామా చేసే వరకు వెళ్లింది.

ప్రమాణ స్వీకారం జరిగిన కొద్దిరోజుల్లోనే రాజీనామా సమర్పించడం కాంగ్రెస్ నాయకత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టింది. అనంతరం పార్టీ పెద్దలు చర్చలు జరిపి ఆయనను ఒప్పించడంతో రాజీనామాను వెనక్కి తీసుకున్నారు. అయితే నగరాభివృద్ధి శాఖ చుట్టూ వివాదాలు ఇంకా కొనసాగుతుండటం గమనార్హం. మరోవైపు మంత్రివర్గంలో స్థానం దక్కని ఎమ్మెల్యేలు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. భవిష్యత్తులో జరిగే విస్తరణలో అవకాశం దక్కుతుందనే ఆశతో పలువురు నేతలు ఢిల్లీలో మకాం వేస్తున్నారు. ముఖ్యంగా డీకే శివకుమార్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న రిజ్వాన్ అర్షద్ ఢిల్లీ వెళ్లడం రాజకీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే శాఖల కేటాయింపు, అధికారాల పంపిణీ, మంత్రివర్గ ప్రాతినిధ్యం వంటి అంశాలు కొత్త చర్చలకు దారితీయడం పార్టీకి సవాల్‌గా మారింది. అసంతృప్తి నేతలను సమన్వయం చేయడం, ప్రభుత్వ స్థిరత్వాన్ని కాపాడడం, రాజకీయ సమతుల్యతను కొనసాగించడం ఇప్పుడు ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు కాంగ్రెస్ అధిష్ఠానం ముందున్న ప్రధాన బాధ్యతగా మారింది. రాబోయే రోజుల్లో ఢిల్లీ స్థాయిలో జరిగే సంప్రదింపులు, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలు ఈ వివాదానికి ముగింపు పలికే అవకాశముంది. అప్పటివరకు కర్ణాటక కాంగ్రెస్ రాజకీయాల్లో శాఖల కేటాయింపు అంశం హాట్ టాపిక్‌గా కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

## శ్రీ చక్రేశ్వర శివాలయంలో పూజా సామగ్రి విక్రయాలకు వేలం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**



బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివ మందిరంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కుల కోసం ఈ నెల 12న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేవస్థానానికి సంబంధించిన కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయ హక్కులను ఒక సంవత్సరం కాలపరిమితితో కిరాయి ఒప్పందం ద్వారా కేటాయించేందుకు ఈ వేలం చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. జూన్ 12న ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో ఈ బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వ్యాపారులు, భక్తులు రూ.5 వేలుల డిపాజిట్ సొమ్మును చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వేలం ప్రక్రియను సంబంధిత అధికారుల పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

# దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలి

**నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**

దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలనే ప్రధాన డిమాండ్‌ను తీసుకుని, ఢిల్లీలోని జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కె.జి.బాలకృష్ణన్‌తో బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సమావేశంలో క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, భీమ్‌గల్ వాసి మాణిక్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న వివక్షపై సమగ్ర నివేదికను కమిషన్ చైర్మన్‌కు బిఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్ అందజేశారు.

ఈ సందర్భంగా మాణిక్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ... క్రైస్తవ సంక్షేమం పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిబద్ధతకు ఈ నివేదిక ఒక నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల సమస్యలపై ఇతర రాజకీయ పార్టీలు మౌనం వహించడం సరికాదని ఆయన విమర్శించారు. దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించడం ద్వారానే వారికి జరుగుతున్న సామాజిక అన్యాయం అంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిషప్ విద్యాసాగర్, మోజెస్, సొలోమోన్, బిషప్ దుర్గం ప్రభాకర్, రమేష్ జాన్ తదితర క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఖండ్‌గావ్ గ్రామంలో వరుస మరణాలు..
# ఆందోళనలో స్థానికులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**



బోధన్ మండలంలోని ఖండ్‌గావ్ గ్రామంలో వరుస మరణాలు గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత నెల రోజుల వ్యవధిలో సుమారు పదిమంది వరకు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరణాలకు గల కారణాలపై స్పష్టత లేకపోవడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య లోపాలు, కలుషిత తాగునీరు వంటి సమస్యలే ప్రాణాపాయానికి కారణమవుతున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే స్పందించి, గ్రామంలో సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్లిష్ట సమయంలో గ్రామంలోని ప్రముఖ రైతు, సామాజిక సేవకుడు జి.పండిత్ రావు పటేల్ మరణం గ్రామానికి తీరని లోటుగా మారింది. ఆయన కేవలం రైతుగానే కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సేవాధుర్యుడిగా అందరికీ సుపరిచితులు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఖండ్‌గావ్‌లో వ్యవసాయ రంగంలో ఆయన ఎంతో కృషి చేశారు. కొత్త రకం వంగడాలు, పొగాకు సాగులో మెలకువలు నేర్పిస్తూ తోటి రైతులకు మార్గదర్శకంగా నిలిచారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ రైతుగా గుర్తింపు పొందిన పండిత్ రావు మరణం గ్రామాన్ని మరింత విషాదంలోకి నెట్టింది. గ్రామంలో నెలకొన్న అసాధారణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య చర్యలను చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామ ప్రజల్లో నెలకొన్న ఆందోళనను తొలగించి, వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

## విద్యా వ్యాపారాలపై సమగ్ర విచారణ
# జరిపి చర్యలు తీసుకోవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**



జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమ దందాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సంజయ్ తలారే డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఐఐటి, జేఈఈ, నీట్ ఫౌండేషన్, ఒలంపియాడ్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలోని ప్రతి మండలంలో అంతర్జాతీయ స్థాయి విద్య పేరిట పాఠశాలలు వెలుస్తున్నాయని, వీటికి తగిన అనుమతులు, కనీస ప్రమాణాలు ఉన్నాయా లేదా అనే అంశంపై స్పష్టత లేదని సంజయ్ విమర్శించారు. చిన్నారులపై అధిక చదువు భారం వేసి, ప్రతిరోజూ పరీక్షలు, ప్రత్యేక కోచింగ్ల పేరుతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్మిషన్, ట్యూషన్, ట్రాన్స్‌పోర్ట్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ వంటి అంశాలతో సామాన్య, మధ్య తరగతి మరియు బహుజన కుటుంబాల నుండి భారీగా డబ్బులు వసూలు చేస్తూ, విద్యను వ్యాపారంగా మార్చారని మండిపడ్డారు. ప్రైవేట్ విద్యా సంస్థల అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఫీజుల నిర్మాణం మరియు వారు ఇచ్చే ప్రకటనలపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. విద్య అనేది ప్రతి చిన్నారి ప్రాథమిక హక్కు అని, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందకుండా చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విద్యా వ్యాపార ధోరణిని మానుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## యూరియా లింక్ పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**



జిల్లాలో యూరియా నిల్వలు, సరఫరాపై జరుగుతున్న అసత్య ప్రచారాలను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులకు అవసరమైన మేర నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం ఎడపల్లి మండలంలోని జానకంపేట్ వ్యవసాయ సహకార సంఘం గోదాముతో పాటు ఎడపల్లిలోని పలు ప్రైవేట్ గోదాములను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాముల్లో ఉన్న యూరియా నిల్వలను పరిశీలించడంతో పాటు, ఆన్‌లైన్ బుకింగ్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతున్న తీరును సమీక్షించారు. ఆన్‌లైన్ బుకింగ్ విధానం వల్ల ఎరువుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆమె పేర్కొన్నారు. రైతులు యూరియాను అధిక మోతాదులో వినియోగించకుండా నానో యూరియా, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నానో యూరియా వాడకం వల్ల భూమి సారం పెరుగుతుందని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందనే అపోహలను రైతులు నమ్మవద్దని సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు దిశానిర్దేశం చేశారు. ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు పాటించాలని, యూరియాతో పాటు ఇతర ఉత్పత్తులను బలవంతంగా కొనుగోలు చేయాలని రైతులకు ఒత్తిడి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత డీలర్‌షిప్‌లను రద్దు చేసేందుకు వెనుకాడబోమని ఆమె స్పష్టం చేశారు. యూరియా నిల్వలు, పంపిణీ వ్యవస్థపై వ్యవసాయ, రెవెన్యూ, సహకార శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో మండల రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.





# నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం

**బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఎల్‌ఏలకు శిక్షణ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, జూన్ 09(డీడీ9 వార్త) :**

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల నమోదు, జాబితాల సవరణ అత్యంత కీలకమని, దీనిపై బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బోధన్ పట్రాటణంలోని రాకాసిపేట్ లయన్స్ క్లబ్ సమావేశ హాల్ లో మంగళవారం నియోజకవర్గ స్థాయి బీఎల్ఏల కోసం నిర్వహించిన శిక్షణ తరగతులు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, శేఖర్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆదిత్య రెడ్డి గిల్లెల, ఎంఎస్ఎంఈ రాష్ట్ర అధ్యక్షుడు శశాంక్ పసుపులేటి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిక్షణలో భాగంగా వక్తలు ఓటరు జాబితాలను పకడ్బందీగా పరిశీలించడం, అందులోని తప్పులను సరిదిద్దడం మరియు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నూతన నిబంధనలు, ఓటరు వివరాల తొలగింపు మరియు మార్పులుచేర్పులపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఎన్నికల కమిషన్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఏ విధంగా పరిశీలించాలో సాంకేతిక అంశాలను ఏ విధంగా పరిష్కరించాలో వివరించారు. బూత్ స్థాయిలో పార్టీ తరపున ఏజెంట్లు ఏ విధంగా వ్యవహరించాలి, ఓటర్లతో ఎలా సమన్వయం చేసుకోవాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం, అక్రమ నమోదులను అరికట్టడంలో బీఎల్ఏలు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, టీపీసీసీ డెలికేట్ గంగా శంకర్, శరత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దాము, వక్స్ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఇకపై అలాంటి పాత్రలను మాత్రమే ఎంచుకోవాలనుకుంటున్నా..



కన్నప్ప సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్న ప్రీతి ముకుందన్.. ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా మారిపోయారు. ఇటీవల బ్లాస్ట్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈ భామ ఇప్పుడు వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ప్రీతి, తను నటిస్తున్న చిత్రాలు, పాత్రల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినిమాల ఎంపిక గురించి ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ.. "నేను ఎంచుకుంటున్న కథలు చాలా కొత్తగా ఉంటున్నాయి. ఒకేలాంటి పాత్రలు కాకుండా ప్రతి మూవీలోనూ వైవిధ్యం ఉండేలా చూసుకుంటున్నాను. 'ఇదయం మురళి' చిత్రంలో నేను ఒక పద్ధతైన సంప్రదాయ హీరోయిన్ పాత్రలో కనిపిస్తుండగా, 'దశమకన్' సినిమాలో మాత్రం చాలా అమాయకపు యువతిగా నటిస్తున్నాను.

అలాగే పాపులర్ యాక్టర్ అశోక్ సెల్వన్ కాంబినేషన్‌లో చేస్తున్న మరో సినిమాలో, నేను భావోద్వేగాలతో కూడిన, చాలా మెచ్యూర్డ్ పాత్రను పోషిస్తున్నాను. వీటితో పాటు హిందీ చిత్రాల్లో కూడా నటించాలని నాకు చాలా ఆశగా ఉంది" అని చెప్పారు. తన కెరీర్ ప్లానింగ్ గురించి వివరిస్తూ.. "ప్రస్తుతం నేను కాస్త నెమ్మదించి, నా సినిమాలు ప్రేక్షకులకు ఎలా నచ్చుతున్నాయో గమనిస్తున్నాను. నా నటనను నేనే అంచనా వేసుకుని, ఆ తర్వాతే మరిన్ని కొత్త ప్రాజెక్టులను ఓకే చేయాలనుకుంటున్నాను. ఈ ఏడాది నావి కనీసం 5 నుండి 6 చిత్రాలు విడుదలవుతాయని ఆశిస్తున్నాను. సాధారణంగా ప్రేక్షకులు నన్ను గ్లామరస్ కమర్షియల్ హీరోయిన్ పాత్రల్లో చూడాలని కోరుకుంటారు. కానీ నేను మాత్రం ప్రస్తుతం అస్సలు వదులుకోకూడని అద్భుతమైన కథలను మాత్రమే ఎంచుకోవాలని ఫిక్స్ అయ్యాను" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# 'మకుటం' టీజర్ అప్డేట్ ఇచ్చిన విశాల్..



కోలీవుడ్ హీరో విశాల్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ.. ఇప్పుడు సరికొత్త అవతారంలోకి మారారు. 'మకుటం' సినిమాలో ప్రధాన పాత్రలో నటించడంతో పాటు దర్శకత్వం బాధ్యతలు కూడా తీసుకున్నాడు. తమిళంలో 'మగుడం' పేరుతో రాబోతుంది. ఆర్ బి చౌదరి సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. విశాల్ సరసన దుషారా విజయన్, అంజలి హీరోయిన్లుగా నటిస్తుండగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మకుటం' చిత్రం పూర్తిగా సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక పవర్‌ఫుల్ మాఫియా, క్రైమ్ డ్రామా అని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన టీజర్ రాబోతున్నట్లు విశాల్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "చివరికి, దర్శకుడిగా నా అధికారిక అరంగేట్రం జరుగుతోంది. ఈ కల నిజం కావాలని నేను గత 30 ఏళ్లకు పైగా ఎంతో ఆశతో, ఆరాటంతో ఎదురుచూశాను. మకుటంతో కల నిజం కాబోతోంది. మేము ఎంతో శ్రద్ధగా, ఇష్టపడి రూపొందించిన ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురాబోతున్నందుకు చాలా ఉత్సాహంగా ఉంది. జూన్ 10న 'మకుటం' టీజర్‌ను మీ ముందుకు తీసుకువస్తున్నాం. మాపై దేవుని ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలి" అని ఎమోషనల్ అయ్యారు.



# రిలీజ్‌కు సిద్ధమైన 'కొరియన్ కనకరాజు'!

మెగా హీరో వరుణ్ తేజ్ హిట్ కోసం గత కొద్ది కాలంగా సమమతమవుతున్నాడు. వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ బాక్సాఫీసు వద్ద ఆశినంత స్థాయిలో విజయాన్ని దక్కించుకోలేకపోతున్నాయి. అయినప్పటికీ ఆయన ఏ మాత్రం నిరాశ చెందుకుండా వరుస ప్రాజెక్ట్స్ అనౌన్స్ చేస్తున్నాడు. ప్రస్తుతం వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. ఇందులో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. వినూత్నమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే కొంతశాతం పూర్తి కాగా.. విడుదలైన టీజన్, ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను సొంతం చేసుకున్నాయి. ఇక ఇప్పుడు షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా? అని అంతా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని ఈ ఏడాది ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్.అంతేకాకుండా జూన్ మూడో వారంలో స్పెషల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఇక దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఆ కఠిన సమయంలో నాకు అండగా నిలిచింది వాళ్లే..



'ప్రేమదేశం' సినిమాతో యూత్ ఫేవరెట్ హీరోగా మారాడు అబ్బాస్. ఆ తర్వాత ప్రేమకథా చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడంతో పాటుగా లవర్ బాయ్ అనే ట్యాగ్ దక్కించుకున్నాడు. అయినప్పటికీ కొద్ది కాలం తర్వాత అవకాశాలు తగ్గాయి. దీంతో సినిమా ఇండస్ట్రీకి కొంత గ్యాప్ ఇచ్చిన అబ్బాస్ హార్పిక్ యాడ్‌లో చేశాడు. దీంతో ఆయనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సిల్వర్ స్క్రీన్‌పై హ్యాండ్సమ్ హీరోగా కనిపించిన అబ్బాస్ యాడ్‌లో చూడలేకపోయిన అభిమానులు కూడా ఆందోళన చెందారు. ఆ తర్వాత ఆయన ఇండియాలోనే కనిపించలేదు.కుటుంబం కోసం విదేశాలకు వెళ్లిపోయాడు.మళ్లీ ఇటీవల వచ్చిన జీవి ప్రకాష్ 'హ్యాపీరాజ్' సినిమాతో ఇండస్ట్రీకి రీఎంట్రీ ఇచ్చాడు.అయితే ఈ మూవీ బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో పాటుగా అభిమానుల ఆనందానికి కారణమైంది. అలాగే క్రైమ్ థ్రిల్లర్ ఎగ్జామ్ వెబ్ సిరీస్‌లోనూ నటించాడు. ఇది కూడా సూపర్ హిట్ కావడంతో ప్రస్తుతం ఆయనకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అబ్బాస్ చేతిలో ఒక్క సినిమా ప్రాజెక్ట్ కూడా లేని కష్టకాలంలో ఆ హార్పిక్ బ్రాండ్ తనకు దేవుడిలా అండగా నిలిచిందని అబ్బాస్ పేర్కొన్నాడు.

"హార్పిక్ యాడ్ చేయడం వల్లే నా ప్లేట్‌లోకి అన్నం వచ్చింది. దాదాపు ఎనిమిది సంవత్సరాల పాటు ఆ యాడ్ కాంట్రాక్ట్ ద్వారా లభించిన డబ్బుతోనే నేను నా కుటుంబాన్ని పోషించాను. ఆర్థికంగా అంతో ఇంతో స్థిరపడగలిగాను. ఆ బ్రాండ్ యాజమాన్యం నన్ను ఎంతో సపోర్ట్ చేసింది" అని అబ్బాస్ వివరించాడు.


# ఫుల్ స్వింగ్‌లో 'కింగ్100' షూటింగ్..



టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున ఇప్పటికీ వరుస సినిమాలతో కుర్ర హీరోలకు గట్టి పోటీనిస్తున్నారు. ఆయన కొడుకులు అక్కినేని అఖిల్, అక్కినేని నాగచైతన్య కంటే యంగ్‌గా కనిపిస్తూ.. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఇకఆయన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో టబు కీలక పాత్రలో నటిస్తోంది. నాగార్జునకు జోడీగా ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా కనిపించనుంది. యాక్షన్ డ్రామా ఎమోషన్స్ కలిపి దీనిని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ సైలెంట్‌గా దూసుకెల్తోంది. అంతేకాకుండా దాదాపు షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం.

త్వరలోనే చిత్రీకరణ పూర్తి చేస పోస్ట్ ప్రొడక్షన్ పనులపై ఫోకస్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోందట. మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను విడుదల చేసేందుకు సోలో తేదీతో పాటు స్పెషల్‌గా థియేటర్స్‌లోకి తీసుకురావాలని మూవీ మేకర్స్ చూస్తున్నారట. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీని ఈ ఏడాది దసరా పండుగ కానుకగా అక్టోబర్ 20కి థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్. టైటిల్ ఖరారు కానీ ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, టీజర్‌ను కూడా త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ అప్డేట్‌తో అక్కినేని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# 'డ్రాగన్' సినిమాలో మలయాళ ముద్దుగుమ్మ!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం నందమూరి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందిఈ సినిమా గురించి తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. మలయాళంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి దర్శన రాజేంద్రన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఆమె ఇప్పటికే షూటింగ్‌లో కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది.

మూవీలో ఆమె పాత్ర చాలా ఎమోషనల్‌గా, కథను మలుపు తిప్పే విధంగా ఉంటుందని సమాచారం. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా.. జూలై నెలలో చిత్ర యూనిట్ శ్రీలంక వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ ఒక భారీ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది షూటింగ్ పూర్తి చేసుకుని, వచ్చే ఏడాది అంటే 2027, జూన్ 11న 'డ్రాగన్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.

# రాత్రింబవళ్ళు కష్టపడే ఆ లక్షలాది మంది సిబ్బందికి దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు



బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'భారత్ భాగ్య విధాత'. ఈ సినిమా 2008 ముంబై ఉగ్రదాడుల నేపథ్యంలో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కింది. మనోజ్ తపాడియా దర్శకత్వం వహించగా.. ఈ మూవీని మణికర్ణిక ఫిల్మ్స్, పరమాన్స్ క్రియేషన్స్, యునోయా ఫిల్మ్స్ ఫ్లోటింగ్ రాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సంయుక్తంగా నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకుని జూన్ 12న థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కంగనా.. సమాజంలో నర్సులు, హెల్త్‌కేర్ సిబ్బందిని చూసే విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నర్సుల పట్ల ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాలని కోరారు.

"మన సమాజంలో నర్సింగ్ వృత్తిని చాలా తక్కువ చేసి చూస్తారు. నిజం చెప్పాలంటే, దాన్ని ఒక గ్లామర్ వృత్తిగా మార్చేశారు. హాస్పిటల్‌కు వస్తే నర్సులతో కాసేపు టైమ్‌పాస్ మాట్లాడొచ్చు అనే చులకన భావం చాలామందిలో ఉంది. మా సినిమాలో కూడా దీనిపై ఒక డైలాగ్ ఉంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. మనం హాస్పిటల్ అనగానే కేవలం డాక్టర్ల గురించే ఆలోచిస్తామని, కానీ రోగులను శుభ్రం చేయడం నుండి హాస్పిటల్‌ను నడపడం వరకు ప్రతి పనినీ నర్సులే చూసుకుంటారని కంగనా గుర్తుచేశారు. రాత్రింబవళ్ళు కష్టపడే ఆ లక్షలాది మంది సిబ్బందికి దక్కాల్సిన గౌరవం దక్కడం లేదని అన్నారు. ఈ సినిమా చూశాకైనా నర్సుల పట్ల ప్రజల చూపులో కొంచెం మార్పు వచ్చినా, తమ ప్రయత్నం విజయవంతమైనట్లేనని కంగనా రనౌత్ తెలిపారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500101. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.